


# శపథము

సోమంచి అన్నపూర్ణేశ్వర శాస్త్రిగారు


విశ్వేశ్వరు డొక స్వచ్ఛమైన బ్రాహ్మణ కుటుంబమునకు జేరినవాడు. పెద్ద ఆస్తి పరుడు. ఆతని చిన్నతనమందే తలిదండ్రులు గతించుటవలన నాతడు తన పినతండ్రి చెప్పు చేతలలో నుండవలసి వచ్చెను. ఆతనివంశ మున నందఱును పండితు లైనప్పటికిని, తండ్రి లేకపోవుటవలన నాతని విషయమై యెవ్వరును శ్రద్ధతీసికొనక పోవుటవలన నాతనికి విశేష ముగ చదువు రాలేదు.

ఆతడు తన యిరువదవయేట దనపల్లె యందున్న పాఠశాలయం దుపాధ్యాయుడుగ గుదిరెను. ఆతడా పాఠశాలయందు రెండేండ్లు పనిచేసి, తరువాత నా పనిని మానుకొని యస హాయోద్యమమున బ్రవేశించి, దానియందలి నిర్మాణ కార్యక్రమమున తీవ్రముగ బనిజేయ బ్రారంభించెను. కాని యాకార్యక్రమ మంత మొందగానే యాతడు జాతీయ మహాసభా సభ్యుడుగనుండుటమాని నిమ్నజాత్యుద్ధరణము వందు తన శక్తినంతయువిని యోగింపబూనెను.

విశ్వేశ్వరుడు తన యూరనేయుండిన బంధువులతోడ మాలవారిని ముట్టుకొనవలయు ననియు, నందువలన దోషము లేదనియును, నీచముగా జూడబడుచుండిన వారి నుద్ధరించు టావశ్యక మనియును, వారును తమవంటి మానవులే గనుక వారికిగూడ సంఘమందు మంచి చోటీయవలయు ననియును, ప్రతిమానవుడును భ్రాతృత్వతత్త్వము నర్థముచేసికొని నడచికొనవలయు ననియును, చెప్పుచు వచ్చెను. కాని విశ్వేశ్వరుని బంధువు లందఱును ఆతని దిట్టుచు వచ్చిరి.


విశ్వేశ్వరు డిక నూరిలో నుపన్యసింప బ్రారంభించెను. ఆతనితో చాలమంది వాదించుచుండిరి. కొందఱాతని తిట్టుచుండిరి. ఆతని వాదనలను జూచి యాయూరివా రందఱు నాతనిని పిచ్చివా డనజొచ్చిరి. కాని యాత డధీరుడు కాలేదు. వారిని లక్ష్యముచేయుట లేదు. తన కిచ్చ వచ్చినట్లే యాచరించుచు, దనయూరి మాల లందఱకును సహాయము చేయుచుండెను,

ఒకనా డాతడు తనపొలమం దొకమాల వాడు దున్నుచుండగా నాగలిక ఱ్ఱామాల వానికాలు చీల్చివైచెను. విశ్వేశ్వరు డామాలని




ముట్టుకొని యాతని గాయమునకు కట్టుగట్టి సేవచేయు టాతని పినతండ్రి చూచెను. ఆత డింటికి పోగానే యాతని పినతండ్రి విశ్వేశ్వరునితో జందెమును తీసివేయవలసినదని చెప్పెను. కాని విశ్వేశ్వరుడు వినలేదు. ఆతని కాదినమున పినతండ్రి భోజనము పెట్టలేదు. అందుచేత నాతడు తన పినతండ్రితో మాట్లాడుట మాను కొనెను. ఆయూరిలోనున్న పండితులందఱు గలసి యాతని కాంతు నిచ్చిరి. ఆతనితోడ నందఱును మాటాడుట మానిరి.

ఇట్టి పరిస్థితులలో గూడ విశ్వేశ్వరుడు ధైర్యము వీడలేదు. ఆతడు ప్రతిదినమును పెద్ద లందఱును గలసికొను దేవాలయము నొద్దకు జని, యీ నిమ్నజాతుల నుద్ధరింపకపోవుటవల ననే బ్రాహ్మణులందఱును చెడిపోవుచుండి రని యును, వారికంటె నీచు లనుకొనబడువారి నుద్ధరించిననేగాని వారు వారి కర్తవ్యముల నెఱ వేర్చుకొనువారు కారనియు, నీ కర్తవ్యమును మఱచియుండుటంజేసియే బ్రాహ్మణులకు గౌరవము పోయిన దనియు చెప్పుచు వచ్చెను. విశ్వేశ్వరునియం దీ యాకస్మిక మానసికపరివర్తనను జూచి, రెండేండ్ల క్రిందట నేమియు లేకయుండిన యాతని కేమైన పిచ్చియెత్తిన దేమోయని వారు భయపడి, యొకనాడు విశ్వేశ్వరుని పట్టుకొని యాతనితల గొఱిగించి నిమ్మపండ్ల రసమున దల మర్దించిరి ఇదియంతయు



నుజూచి విశ్వేశ్వరుడు మొదటనవ్వుకొనెనుగాని

వారందఱును దన్ను హేళనము చేయునపుడు మాత్ర మాతనికోప మాగలేదు. అతడు వారి మూర్ఖతకు వారిని మొదట దిట్టఁజొచ్చెనుగాని యట్లు చేయుట తప్పని యాత దూరకుండె.

ఆత డాదినమున నాపలెదగ్గరనే యున్న యొకకొండమీఁది కెక్కి, యొక సెలయేటి ప్రక్కను కూరుచుండి తన స్థితినిగూర్చి విచారింప నారంభించెను. ఆతని కేపని జేయుటకు తోఁపకపోయినందున నాదినమున నాతడుమాల పల్లెకు పోలేదు. ఆత డాదినమంతయును విచారించుచు గడపెను. ఊరిలోనివారందఱు నాతని పిచ్చివా డనుచుండిరేమి?—వారు పిచ్చివారు కారా? వారికేమైన తెలివితేటలున్నవా, లేవా? పిచ్చితన మనుకొనబడుచున్నదియేయుత్కృష్టమగు ధీశక్తియేమో! ఈప్రశ్నకు సమాధానమిచ్చుటెట్లు? సాధారణమానవుడుసాధారణముగ రాత్రియం దెపుడో కాంచు దృశ్యముల నొక పిచ్చివాఁడు పగలే కాంచుచు, నాదృశ్యములందొకానొక యద్భుతమహత్త్వమును గనిపెట్టుచు, సాధారణమానవుడు సాధారణముగ నర్థము చేసికొన జాలని యొకగొప్ప సూనృతము కనుగొనుచుండునేమో! —కొంతకొంత యైనప్పటికిని పిచ్చివాఁడు కేవలము నీ ప్రపంచమందందఱు తీసికొను చెడ్డనే జేరదీసికొనక, వారెన్నఁడు దెలియజాలని మంచిసంగతులనే కనిపెట్టుచుండునేమో!

విశ్వేశ్వరు డట్లు తలచుచు నాసెలయేటి దగ్గర కూరుచుండిన సమయమున నాతని కొక ధ్వని వినవచ్చెను. ఆత డాధ్వని యెచటనుండి వచ్చినదో తెలిసికొనుటకు తన చుట్టుపట్టుల వెదకెను, గాని యాతని కెవ్వరును గాన్పింప లేదు. ఆ ధ్వని మరల వినవచ్చెను. అది "ఆర్యా! మీ రిటుల మానవులకొఱకు పాటుపడుచున్నారు! మీకు దీనివలన గలుగు లాభ మేమి?" యని విశ్వేశ్వరుని ప్రశ్నించెను.

విశ్వే—నా యాత్మకు సంతసమే!

ధ్వని—అట్లయిన మీరు చనిపోయినతరువాత మీయాత్మ సంతసించు టెటులు?

విశ్వే—నా యాత్మ యింకొక లోకమునకు పోయి, యచట నెవరైన కష్టజీవు లున్న యెడల వారికి సేవచేయును.

ధ్వని—ఇంకొకలోక మనగా మీ యభిప్రాయము?

విశ్వే—బహుశః నరకమని—

ధ్వని—మీరు చాల పొరబడుచుంటిరి. మీరు నరకమున కెట్లు పోవుదురు?

విశ్వే—ఈయూరనున్న పండితులందఱు నే నేదియో పాపకార్య మాచరించుచుంటి నని నన్ను వెలివేసినారు. నేను పాపకార్య మొనర్చిన, నాకు నరకప్రాప్తియే గదా ఫలము!

ధ్వని—అయ్యో! మీ రటులే నమ్మితిరా? ఇట్టి మహత్కార్యము నొనరించుచున్న మీరు నరకమున కెట్లు పోవుదురు? మీరు స్వర్గమునకే పోవుదురు.

విశ్వే—అయ్యో! అదియే నిజమా? అట్లయిన యెడల నేను చనిపోయిన తరువాత నిక కష్టజీవులకు సేవచేయుటకు వీలు లేదా?

ఆ ధ్వని మరల వినరాలేదు. విశ్వేశ్వరు డెపుడో ముందు సంభవింపబోవుదానినిగూర్చి విలపింప నారంభించెను. ఆ కొండమాత్ర మా తని రోదన ధ్వనినే ప్రతిధ్వనించుచుండెను గాని యా ధ్వనిమాత్రము తిరిగి వినరాలేదు.

దీనిమూలమున విశ్వేశ్వరునకు సుఖము పోయినది. ఆతడు తన కర్తవ్యమును మఱచిపో యెను. విచారపడుచుండెను. ఈ విచారమునకు లోనై యాతడుచ్చరించు పరాకుమాటలవలన ప్రజలందఱు నీతనికి తప్పక పిచ్చియెత్తిన దని నమ్మి, చిన్నవారును, పెద్దవారునుగూడ నీత నిని హేళనము జేయ ప్రారంభించిరి. ఆతడు దానికై విచారపడుచుండెను. తన మనసులో నున్న విషయములను విమర్శించుకొనజాల కుండెను. ఆతని కష్ట డాధ్వని వినవచ్చినప్పటికి పూర్వ ముండెడి మానసికశక్తియును, తార్కిక ద్రఢిమయును పోయి, ప్రతిదానియందును సందే హము, నిరాశ, యపనమ్మకము, అందువలన గలిగిన యుపేక్షయునే యాతని మానసిక ప్రపంచమును పాలించుచుండెను.

ఆత డిట్లనవసరముగ బాధపడుచుండెను.

ఏవిధముగను పూర్వపుసంతస మేర్పడుట లేదు. అదివఱ కాతడు తనపని జేయుచున్నపుడు గలుగుచుండిన నిస్తులానంద మిపుడు మాయమై పోయినది. ఇటులు దినము లెటులో వికలత్వ ముతో గడపుచుండెనుగాని విశ్వేశ్వరుడు తన మనసునకు విశ్రాంతినీయ ప్రయత్నింపలేదు.

విశ్వేశ్వరు డొకనాటి సాయంకాలమున నా ధ్వనివినవచ్చిన చోటికి పోయి, యచట కూ ర్చుండి, "ఈ బాధ పడు టెందులకు? నాకీ విచార మేల?—నాకీ జీవిత మెందులకు కష్టము గలి గించునదిగ తోచుచున్నది?—ఇట్టిస్థితిని భగ వాను డెందులకు నాకు తెచ్చిపెట్టినాడు?" అని విచారించుచుండి, కొంతశాంతి యలవరచు కొనన గునని తలచి దేవుని ప్రార్థింప మొదలి డెను. ఇట్లాత డీశ్వరుని ప్రార్థించుచుండ నొక వ్యక్తి యాతని పలుకరించినటు లయ్యెను. విశ్వేశ్వరుడు తల పైకెత్తి చూచుసరి కాతని



యెదుట నొకముదుసలిజడదారినిలిచియుండెను.

విశ్వేశ్వరు డాతని చూచి యొక నిట్టూర్పు విడిచెను. విశ్వేశ్వరుని ముఖమున నపుడు దుఃఖమే రాజ్యము చేయుచుండెను. నిరాశ మాత్రము మంత్రిత్వమును స్వీకరించెను. విశ్వేశ్వరు డట నా జడదారిని జూచుచు నేమియు బలుకక, దీర్ఘముగ జింతించుచు కన్నుల నీరు గార్చుచుండెను. ఆ జడదారి యాతని ప్రేమ పూర్వకముగ వీక్షించి, "ఓయీ! నీవిటు లుండుటకు కారణమేమి? నీ వనుభవించు కష్టమేమి?" యని కరుణగదుర నాతని ప్రశ్నించెను. విశ్వేశ్వరుడు తన స్థితిగతులు చెప్పి, యా ధ్వనిసంగతి గూడ చెప్పి, యా జడదారితో "అయ్యా! నేను నాయూవచ్ఛక్తియును విని యోగించి నిమ్నజాతుల నుద్ధరించుటకై పాటుపడుచుంటినే!—అట్టియెడ నేనేమి యపరాధ మొనర్చితినని భగవాను డిట్లు నామీద నిర్దయుడైనాడు?—నే నందఱను హెచ్చుతగ్గులు లేకుండ ప్రేమించినందులకు నా కీ నిందయేనా ఫలము?" అని పలికెను. అపు డా జడదారి చిఱునవ్వునవ్వి, విశ్వేశ్వరునితో "నాయనా!—చనిపోయిన తరువాత నరకమునకు పోయెదవో, స్వర్గమునకు పోయెదవో యన్న గొడవ యెందులకు?—నీ కర్తవ్య మేమియో నీ వీ ప్రపంచమున నున్నంతవఱకును నెఱవేర్చికోవలసిన దే!—దానికి కారణ మడుగ కూడదు. ఫల మాసింపరాదు.

"అది గాకపోయినను, మానవునకు మానసమే యీ జగత్సృష్టి కాధారభూతము. కనుక నదియే యీ ప్రపంచము నంతయును సృజించుచుండును. లయ మొందించుచుండును. కనుక నదియే విశ్వతత్త్వాలాలసకు కారణము. కష్టసుఖములు దానినిబట్టి వచ్చుచుండును. అందుచేతనే మానవు డీప్రపంచమున తన మనోవృత్తి ననుసరించి కష్టసుఖములు మానవ జీవితమునందు చూచుచున్నాడు.

"అట్టి మానవుని మానవత్వమునుండి నీవింకను విడివడలేదని నేను తెలిసికొంటిని. అదియునుగాక, నిన్ను నీయహంకారమే యిటుల దీనునిగ జేయుచున్నది —నీ కొక చిన్న కథను చెప్పుచున్నాను వినుము.

"పూర్వ మొక రాజుండెడివా డట. ఆత డొకనాడు తన ప్రధానితో 'నేను నాభోజన పదార్థములందు విషమును జూచితిని. నా కనేక శత్రువు లున్నటుల తోచుచున్నది. నీవు వారి నందఱిని పట్టుకొని నావద్దకు తీసికొని రావలయును' అని చెప్పెను.

"ఆ మరునాడు ప్రధాని తొంబదితొమ్మిది మంది మనుష్యులను సంకెలలతో తీసికొని వచ్చి రాజునెదుట నిలువబెట్టెను.

"రాజు—ఇపుడే వీరినందఱిని చంపివేయుడు.

"మంత్రి—అందఱనా? రాజా!

"రాజు—అందఱను! నిశ్చయముగ.

"ఒకవిషయము. ఆ రాజు నా దేశపు ప్రజలు ప్రేమించుటలేదు. ఆతనికుండు నధికారమత్తత,

గర్వాఃము, అహంకారము, ద్రవ్యాపేక్ష, కఠినత మొదలగునవి ప్రజలను వానియెడల సహితు లుగ జేసివైచెను.

"మంత్రి—సరియే! రాజా!

"రాజునొద్ద సెలవునీసికొని ప్రధాని సైన్యా ధ్యక్షునితో కొలదిసేపు మాటాడెను. తరు వాత కొంతమంది విలుకాండ్రు వచ్చి నేరస్థుల వెనుక నిలిచిరి. రాజు ముందఃన నుండెను. విలు కాండ్రందఱును సంతోషమును బట్టజాల కుండిరి.

"రాజు—వీరినందఱి నొక్క త్రుటిలో చంపి వేయవలయును. సిద్ధముగ నుండుడు.

"సేనాని—సైనికులారా! మీపని కానీయుడు.

"విలుకాండ్రు తమ యధ్యక్షుని యాజ్ఞను వినిరి. మొదట చంపబడినవ్యక్తి యా రాజేం ద్రుడే!

"అనగా నారాజునట్లు ప్రతిమానవుడును తనలోననే యుండిన శత్రువులను జయింపజా లక, పైశత్రువులను జూచి వారిని దండింప దలచి, తాను బాధపడుచున్నాడు. కనుక తనలో నున్న శాత్రవుల నెవ్వరుజయింతురో యట్టివారే యీప్రపంచమునంతయును జయిం తురు. అపుడే కష్టసుఖముల కెంతయును వారి మీద హక్కుండదు.

"అందుచేత, నీయహంకారము—'నే నే దియో మానవులకు సేవ చేయగల' ననెడి యహంకారము—ఆ సేవయే యెప్పుడును చేయవలెననెడి యాశమూలముననే గదా నీ కిట్టిస్థితి గలిగినది. దీనికి నిన్నేమియు నన నవస రము లేదు;—ప్రపంచమంతయు నిట్లే యు న్నది!

"మానవు డొకప్పుడు సుందరుడు; చిదా నందుడు; దయామయుడు; శాంతివాది; నిర్మల జీవ ప్రతిమ: ఒకప్పు డా సర్వలక్షణలక్షితుడై యుండిన మానవుడు—ఈ సకలప్రపంచము నందలి చరాచరములందఃను విశేషగఃణవిశిష్టు డయ్యు నిర్విశిష్టుడై యుండగలిగిన మానవుడు, ఈపాంచభౌతిక సముదాయమున కతీతుడై 'శివోహ'మ్మని చెప్పగలిగిన మానవుడు— ఇపుడు నిర్జీవపాషాణ ప్రతిమ. దురాత్ముడై, యరిషడ్వర్గజితుడై, యీపఃతాపత్రయీవ్యాధి తుడై మనుచున్నాడు. ఆ మానవశ్రేష్ఠుడేనా యీ నిర్జీవపాషాణప్రతిమ?—" అని పలికెను.

విశ్వే.— (జడదారి పాదములపై బడి) తండ్రీ! నీవే నిజమగు మిత్రుడవు—నా యజ్ఞా నాంధకారమును దొఃగద్రోచిన జ్ఞాన భాస్క రుడవు. నా కిపుడు జ్ఞానమును ప్రసాదించితివి. నాకిపుడు నాస్థితి యర్థమైనది. దయామయు డగు నాపరమేశ్వరుడే సకలమును చేయవల యునుగాని, మనము కర్తల మగుదఃమా? ఆతడే మనల సుఖుల జేసినను,దుఃఖభాజనుల జేసినను. లోకరక్షణదక్షుడగు పరమేశ్వరునిలీల లనంత ములు! మానవుడు సాంతుడను సంగతి మఱ వక, నాయనంతుని కెల్లప్పఃడును జోహారు చేయుచుండవలసినదే!

జడదారి—ఓయీ! ఇది యొక మహత్తర తత్త్వప్రకారము పొరపాటు!—నీమానసమే

యన్నియును చేయుచున్నది. నీవు దేనిని చేయ బూనుదువో, యట్టిదానిని నీవే నిమేషకాలములో చేయజాలుదువు—నీవే యీసకలప్రపంచస్రష్టవు! నీవే యనంతశక్తుడవు! అది యగుట నీలోననే యున్నది. ఇదియే యద్వైత రహస్యము నాయనా!—ఇదియే యొక్కొకపుడు ప్రతిమానవునకును నిజమని తోచుచుండును. నీకే భౌతికజ్ఞాన మున్నదియో యదియే సృష్టికర్తయని తెలిసికొనుము. తానే యీశ్వరుడను స్థిరమైన నమ్మకముచేతను, మననముచేతను మానవుడీశ్వరుడగుటకు సమర్థుడగుచున్నాడు. తన్నే ప్రతిరూపమునందు నారోపించుచున్నాడు గావున నేనర్వమయుడగుచున్నాడు. ఇదియే రహస్యము నాయనా! ఇదియే మనజ్ఞాను లందఱును కష్టపడి తెలిసికొన్న మహత్తర తత్త్వము.

విశ్వే.—తండ్రీ! నేనే సర్వమయుడ నగుదునని చెప్పియుంటివిగదా! అందుచేత, నే నే పనిని చేయనక్కఱలేదా? నే నేమానవునకును సేవజేయనక్కఱలేదా? సర్వమును దైవమయమే మైనపుడిక పరిచర్య యేమి?

జడదారి—నాయనా! మరల నీవు పొరబడుచుంటివి—నీ వెపుడు పరులనియు, మానవజాతియందు నీచులనియు తలచి వారి నుద్ధరించుటకు తలపెట్టితివో యపుడే నీ కీ యద్వైతజ్ఞానము నశించినది. అందుచే నెంతకాలము నీ మానసికవృత్తి నిమ్నజాత్యుద్ధరణమునందు నెలకొనియుండునో యంతకాలము నీకది యున్నది. సంఘసేవయందే నీకు సుఖ మున్నది. కాని యొకటి: నీ మనోవృత్తి నింతకంటె ఘనముగ జేసికొనుట కొకమార్గ మున్నది. నీ వెట్టికర్మను జేయుచుండినను, ఆ కర్మఫల మపేక్షింపక, స్థిరముగ నెప్పుడు కర్మను కర్మకొఱకే చేయుదువో యపుడే నీ కెన్నడును లేని సుఖ మలవడును; చిదానంద మొదవును. అట్లు నీ వెపుడు చేయుదువో యపుడే నీకు నీ యాత్మస్వరూపము వ్యక్తము కాగలదు.


విశ్వేశ్వరు డీయుపదేశమును విని, యా జడదారిముందఱ మోకరించి, ఖిన్నుడై "దేవా నే నేమియు నెఱుగను. సంతతమును నే నేదియో గొప్పకార్య మొనరించుచున్నా ననెడి యహంభావము తోడను, యీరివారెల్ల నా వంటివానిని సైతము పిచ్చివానిని జేసినందులకై కలిగిన కోపముచేతను నిజముగ పిచ్చివాడనైతిని. ఇది వారి తప్పు గాదు! అంతయును నా లోపమే! నే నెపుడీ విశ్వతత్త్వరహస్యములను కనిపెట్టజాలకుంటినో యంతకాలము నీ యరిషడ్వర్గమునకు లోబడి యుండవలసినవాడనే! కనుక నిపుడు కేవలము పరమేశ్వరునియందే నమ్మక ముంచి, యాతడే నన్నీప్రపంచమున నడపుచున్నాడని నమ్మి, యీ సంఘవ్యవస్థ కతీతుడనై, నా కాపరమేశ్వరునిచే నేర్పరుపబడిన పనిని నిష్కాముడనై నెఱవేర్చుటయే శ్రేయమని తోచుచున్నది." అని సాగిలబడి మ్రొక్కెను.

విశ్వేశ్వరు డట్లు మ్రొక్కి తల పైకెత్తునరి కాతని కా జడదారి కానబడలేదు. తాను మాటాడుచున్నపుడాత డెటకేని పోయియుం

డెనా? లేక మాయమయ్యెనా? విశ్వేశ్వరు డా చుట్టుపట్టులనంతయు వెదకెను. కాని యా ముదుసలిజడదారి జాడ మాత్రము కానరా లేదు. విశ్వేశ్వరు డాతనినే పరమేశ్వరుడని నమ్మి, యచటికి పోయి ప్రతిదినమును ప్రార్థించుచుం డెను. ఆత డాముదుసలి—ఆ విశ్వేశ్వరుపాలిట విశ్వేశ్వరుడు—చెప్పినమాటలందలి నిశ్చయా ర్థమును గ్రహించి సంతసించి, తన మనమున నొకవిధమగు శాంతి నెలకొల్పెను. విశ్వేశ్వరు డిపుడు స్వర్గీయానంద మనుభవించుచుండెను. ఇదియేనా యాతనికి మంగళము? ఆజడదారి మాటలందలిసత్య మాతనికి స్ఫురించెనా? విశ్వే శ్వరుడు తరువాత తన కర్తవ్యమును ధీరుడై నెఱవేర్చుచుండెను. ఎవ రేమి యనినను కోప గించుకొనుట మానెను. తన యాస్తినంతయు ను మాలలకు పంచియిచ్చి వారిస్థితిని బాగు చేసెను. తన జీవనమునకు మాత్రము కొలదిగ నుంచుకొనెను. ఆతడా జడదారి బోధించిన చోటనే యొకపర్ణశాల నేర్పఱచుకొని యందు ననే నివసించుచుండెను. తనశక్తినంతయు ధార వోసి మానవజాతికై పాటుపడుచుండుటయందే యాతనికి నిస్తులానంద మలవడుచుండెను. ఆ జడదారిమాటలే విశ్వేశ్వరునికి మంగళప్రదము లైనవి! శివమ్!

---

## అ జం తా చి త్ర ము లు




౨. రురు జాతకము

బోధసత్త్వము మృగజన్మమునుబొందియుండినకాలమున కాశీరాజుచేపట్టుపడి కాశీనగరమునకు రథమునగొంపోబడుట